సమస్యలు లేకుండా చూడాలి

అధికారులను ఆదేశించిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్

మారేడ్‌పల్లి, జూన్ 15: మోండా డివిజన్ రెజిమెంటల్‌బజార్‌లో శనివారం కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు. రెజిమెంటల్‌బజార్‌లో సలూజా నర్సింగ్ హోం వద్ద రెండు సంవత్సరాల క్రితం నూతన సీసీ రోడ్డు నిర్మాణం కోసం రోడ్డును తవ్వి వదిలేయడంతో స్థానిక ప్రజలు, వాహనదారుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అదేవిధంగా బస్తీలో డ్రైనేజీ సమస్య కూడా తీవ్రంగా ఉందని పలు సమస్యలను స్థానిక ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే ఎమ్మెల్యే శ్రీ గణేష్ జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులకు రెజిమెంటల్‌బజార్ ప్రాంతంలో నూతన రోడ్డును వెంటనే వేయాలని, ఇందుకు సంబంధించిన నిధులు కూడా మంజూరు చేయిస్తానన్నారు.అందుకు సంబంధించిన పనులను వీలైనంత త్వరగా ప్రారంభించాలని అధికారులకు సూచించారు. త్వరలో ఈ ప్రాంతంలో మహంకాళి బోనాల జాతర ఉత్సవాలు జరుగనున్నాయని, ఆ ఉత్సవాలను దృష్టిలో ఉంచుకొని డ్రైనేజీ, రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో బాబారావు, అల్లాడి గౌరీ శంకర్, నందికంటి రవి, శ్రవన్, శ్రీనాథ్, బద్రినాథ్ యాదవ్, సంతోష్ యాదవ్, నర్సింహ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రెజిమెంటల్‌బజార్‌లో డ్రైనేజీ పైపులైన్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీ గణేష్

ఎండోమెంట్ స్థలంలో నివాసం ఉన్న వారికి యాజమాన్యపు హక్కులు కల్పించేందుకు కృషి

ఎండోమెంట్ స్థలంలో ఇండ్లను నిర్మించుకొని నివాసం ఉంటు న్న వారందరికీ ప్రభుత్వ యాజమాన్యపు హక్కు కల్గించే విధంగా తన వంతు కృషి చేస్తానని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ అన్నారు. స్థానిక కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శేఖర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో మోండా డివిజన్ శివాజీనగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా బస్తీ వాసులు శ్రీ వేంకటేశ్వర పెరుమాళ్ ఆలయానికి చెందిన స్థలంలో సుమారు110 కుటుంబాలు కొద్ది సంవత్సరాలుగా ఇండ్లను నిర్మించుకొని నివాసం ఉంటున్నారు. త కొద్ది నెలలుగా ఇంటి యజమానులు అద్దెలను చెల్లించకపోవడంతో ఎండోమెంట్ అ ధికారులు నోటీసులను జారీ చేసి ఇంటి బకాయిలను చెల్లించాలని ఒత్తిడి తీసుకురావడంతో...బస్తీ వాసులు స్థానిక ఎమ్మెల్యే శ్రీ గణేష్‌కు సమస్యను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి ఎండోమెంట్ స్థలంలో నివాసం ఉంటున్న వారికి యాజమాన్యపు హక్కులను కల్పిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లేష్ యాదవ్, దేవేందర్, వెంకట్ రాజ్, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఓయూలో విద్యార్థి ఆత్మహత్యాయత్నం

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 15: ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లోని ఇంటర్నేషనల్ హాస్టల్‌లో ఓ విద్యార్థి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండలం కుదుర్మల్ల గ్రామానికి చెందిన ముల్కగల్ల రవి నిజాం కళాశాలలో ఎంఏ తెలుగు మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈ క్రమంలో అతడికి వర్సిటీ అధికారులు ఇంటర్నేషనల్ హాస్టల్‌లోని ఎఫ్128 గదిని కేటాయించారు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం హాస్టల్ బిల్డింగ్ పై నుంచి రవి దూకగా పెద్ద శబ్దం వచ్చింది. శబ్దం విన్న తోటి విద్యార్థులు అతడిని వెంటనే గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆత్మహత్యాయత్నానికి ప్రేమ వ్యవహారమే కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బాలుడి అదృశ్యం

షేక్ మహ్మద్ (ఫైల్)

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 15: కుటుంబ సభ్యులు మందలించడంతో ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిన బాలుడు అదృశ్యమైన ఘటన లాలాగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నార్త్ లాలాగూడలోని లిల్లీ మోడల్ స్కూల్ సమీప ప్రాంతానికి చెందిన షేక్ మహ్మద్ (14) తల్లి పదేళ్ల క్రితం చనిపోవడంతో అతడు బంధువుల ఇంట్లో ఉంటున్నాడు. ఇటీవల షేక్ మహ్మద్‌ను శేషాపహాడ్‌లోని మదర్సాలో చేర్పించారు. అక్కడ ఉండలేక ఈ నెల 13న మధ్యాహ్నం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిపోయాడు. రాత్రైనా తిరిగి ఇంటికి రాకపోవడంతో బంధువులను వాకబు చేశారు. ఎటువంటి ఫలితం లేకపోవడంతో లాలాగూడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యానికి గురైన సుధాకర్‌ను పరామర్శిస్తున్న రామేశ్వర్ గౌడ్, లింగాని శ్రీనివాస్‌లు తదితరులు

బీఆర్ఎస్ నాయకుడికి ఆర్థిక సాయం

అడ్డగుట్ట, జూన్ 15 : అడ్డగుట్ట డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు సుధాకర్ అనారోగ్యానికి గురయ్యాడు. కొన్ని రోజుల క్రితం అస్వస్థతకు గురైన సుధాకర్ తన ఎడమకాలి భాగాన్ని తొలగించారు. సుధాకర్ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ సూచనల మేరకు బీఆర్ఎస్ యువనేత రామేశ్వర్ గౌడ్ నేతృత్వంలో నాయకులు శనివారం తుకారాంగేట్ గడ్డమీది బస్తీలోని సుధాకర్ నివాసానికి వెళ్లి పరామర్శించారు. తన వ్యక్తిగత సాయంగా పద్మారావు రూ.50 వేల ఆర్థిక సాయాన్ని సుధాకర్‌కు అందజేశారు. పార్టీకి కార్యకర్తలే పట్టుకొమ్మలని, వారికి ఎల్లవేళల అందుబాటులో ఉండి సహకారాన్ని అందిస్తామని రామేశ్వర్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో లింగాని శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలు పరిష్కరించండి

జలమండలి జీఎం హరిశంకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ముస్లింలు

అమీర్‌పేట్, జూన్ 15: సనత్‌నగర్ లోని జామా మసీదు జాఫ్రి అధ్యక్షుడు సయ్యద్ నుమానుద్దీన్ ఆధ్వర్యంలో డీఎన్ఎంకాలనీ ప్రతినిధులు కాలనీలో తలెత్తిన నీటి ఇబ్బందులను పరిష్కరించాలని కోరుతూ శనివారం ఎస్ఆర్‌నగర్‌లోని కార్యాలయంలో జలమండలి జీఎం హరిశంకర్, డీజీఎం వంశీకృష్ణలను కలిశారు. 4 పవర్ బోర్లకు మరమ్మతులు తక్షణమే చేపట్టి వినియోగంలోకి తీసుకొచ్చేలా తగిన చర్యలు తీసుకోవాలని సయ్యద్ నుమానుద్దీన్ జీఎంకు వినతి పత్రం సమర్పించారు. దీంతో పాటు ప్రస్తుతం ఒకటిన్నర గంట పాటు జరుగుతున్న నీటి సరఫరా సమయాన్ని రెండు గంటలకు పెంచాలని వారు విజ్ఞప్తి చేశారు. జీఎంను కలిసిన వారిలో కాలనీకి చెందిన ఖురేషి, ఉషాఖ్, అష్జల్, రషీద్, రయీస్ తదితరులున్నారు.

'ఇంజినీరింగ్‌లో 'బీ' కేటగిరీ సీట్లను కన్వీనర్ ద్వారా భర్తీ చేయాలి'

రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మెన్ ప్రొఫెసర్ లింబాద్రికి వినతిపత్రం అందజేస్తున్న టీఆర్ఎస్‌యూ నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 15: రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కళాశాలలో 'బీ' కేటగిరీ సీట్లను కన్వీనర్ ద్వారానే ఆన్‌లైన్‌లో భర్తీ చేయాలని తెలంగాణ రిపబ్లికన్ స్టూడెంట్ యూనియన్ (టీఆర్ఎస్‌యూ) డిమాండ్ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మెన్ ప్రొఫెసర్ లింబాద్రికి వినతిపత్రం అందజేశారు. అనంతరం టీఆర్ఎస్‌యూ రాష్ట్ర కన్వీనర్, ఓయూ ఇన్‌చార్జి బోయ రమేశ్ మాట్లాడుతూ బీఈ, బీటెక్, బీఫార్మసీ, ఫార్మడీ కోర్సుల కళాశాలల్లో 30 శాతం సీట్లను బీ కేటగిరీ కింద మేనేజ్‌మెంట్ కోటాలో ప్రవేశాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. ఈ సీట్ల కేటాయింపులో ఎక్కడా మెరిట్ విధానాన్ని పాటించడం లేదని ఆరోపించారు. సీట్ల కేటాయింపులో ఎక్కడా నిబంధనలు సైతం పాటించడం లేదని మండిపడ్డారు. డొనేషన్ ఎవరు ఎక్కువ ఇస్తే వారికే సీట్లు కేటాయిస్తున్నారని దుయ్యబట్టారు. ఇప్పటికైనా ఉన్నత విద్యామండలి స్పందించి, బీ కేటగిరీ సీట్లను మెరిట్ ప్రాతిపదికన ఆన్‌లైన్ విధానంలో కన్వీనర్ ద్వారానే భర్తీ చేయాలన్నారు. తద్వారా రాష్ట్రంలో ఉన్నత విద్యారంగాన్ని బలోపేతం చేయాలని కోరారు. ప్రతిభ ఉన్న నిరుపేద విద్యార్థులకు సైతం న్యాయం జరుగుతుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రిపబ్లికన్ పార్టీ అధ్యక్షుడు నక్క యాదీశ్వర్, టీఆర్ఎస్‌యూ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు బి. మహేశ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ : భోలక్‌పూర్‌లోని మేకలమండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం శ్రీసత్యసాయి సేవా ట్రస్ట్, గాంధీనగర్ శాఖ, శ్రీసత్యసాయి ధృతి ట్రస్ట్, రియా టక్కర్ ల సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. విద్యార్థులు బాగా చదువుకోవాలని సూచించారు. శ్రీసత్యసాయి సేవా ట్రస్ట్ సభ్యులు లక్ష్మీనారాయణ, రామకృష్ణ, మధుసూదన్, శివరామకృష్ణ, శ్యామల, పాఠశాల ఉపాధ్యాయులు లూర్డు మేరి, లక్ష్మీశ్రీదేవి, సునీత, పరశురామ్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యురాలు సువర్ణ తదితరులు పాల్గొన్నారు. – బన్సీలాల్‌పేట్, జూన్ 15 :

పాలథిన్ కవర్లు పంపిణీ

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 15: ఈనెల 17న బక్రీద్ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ నిమిత్తం వారికి పాలథిన్ కవర్లను డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్‌రెడ్డి శనివారం పంపిణీ చేశారు. తార్నాకలోని డిప్యూటీ మేయర్ క్యాంపు కార్యాలయంలో ఆమె కవర్లను పంపిణీ చేస్తున్న సందర్భంగా మాట్లాడుతూ ముస్లిం సోదర సోదరీమణులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. జంతు వ్యర్థాలను పరిసరాల్లో పడేయకుండా పాలథిన్ కవర్లలో నింపి, చెత్త సేకరించే జీహెచ్ఎంసీ సిబ్బందికి అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మోతె శోభన్‌రెడ్డి, ఏఎంహెచ్‌వో రజినీకాంత్, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ముస్లింలకు పాలథిన్ కవర్లు పంపిణీ చేస్తున్న డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్‌రెడ్డి

మోండా మార్కెట్ అధ్యక్షుడు, మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సోదరుడు శంకర్ యాదవ్ చిత్రపటానికి శనివారం ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు పూలమాల వేసి నివాళులర్పించారు. వెస్ట్ మారేడ్‌పల్లి లోని రాధికా కాలనీలో శంకర్ యాదవ్ నివాసానికి చేరుకొని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు పరామర్శించారు. – మారేడ్‌పల్లి, జూన్ 15

బాధ్యతలు స్వీకరించిన ఏఎంహెచ్‌ఓ రజనీకాంత్

డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్‌రెడ్డిని కలిసి మొక్కను అందజేస్తున్న ఏఎంహెచ్‌వో రజినీకాంత్

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 15: : తార్నాక డివిజన్ అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్‌గా రజనీకాంత్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్ రెడ్డి, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మోతె శోభన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం బక్రీద్ సందర్భంగా తార్నాక డివిజన్ పరిధిలో చేపట్టాల్సిన పారిశుద్ధ్య పనులపై పలు సూచనలు చేశారు. ముస్లిం సోదరులు భక్తి శ్రద్ధలతో నిర్వహించుకునే బక్రీద్ సందర్భంగా డివిజన్‌లో ముస్లింలకు పాలిథిన్ కవర్లను పంపిణీ చేయాలని డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి అధికారులను సూచించారు. కార్యక్రమంలో పారిశుద్ధ్య సిబ్బంది, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీసేందుకు కృషి చేస్తాం

బేగంపేట్, జూన్ 15: ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ క్లబ్ వ్యవస్థాపకుడు గంపా నాగేశ్వర్‌రావు పర్యవేక్షణలో డాక్టర్ ఆదినారాయణరెడ్డి(డీ హెచ్‌డి) ఎగ్జిక్యూటివ్ ఆధ్వర్యంలో ట్రైన్ ది ట్రైనర్ వర్క్‌షాపు 154వ బ్యాచ్‌ను 30 రోజుల పాటు ఆన్‌లైన్‌లో విజయవంతంగా నిర్వహించారు. శనివారం సికింద్రాబాద్‌లోని ఓ హోటల్‌లో రెండు రోజుల పాటు ఆఫ్‌లైన్ క్లాస్‌లు నిర్వహించి సర్టిఫికెట్‌లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో విజయవంతంగా శిక్షణ పూర్తి చేసి అటెండెన్స్, అసైన్‌మెంట్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చినందుకు ప్రముఖ సినీ నిర్మాత, రిటైర్డ్ ఆర్మీ అధికారి బెల్లి జనార్దన్‌యాదవ్ ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో చదివే విద్యార్థులకు చదువుతో పాటు ఉత్తమ ప్రతిభ కనబర్చే విధంగా వారు మానసిక ఒత్తిడికి గురికాకుండా చదువులో అభివృద్ధి చెందేవిధంగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఇంపాక్ట్ ఫౌండేషన్ ఆదిగురు, టీం డైరక్టర్ ఇంటూరి భాస్కర్‌రావు, ఇన్‌చార్జిలు చక్రవర్తి,రవీంద్ర బాబు, శ్రీనివాస్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న బెల్లి జనార్దయాదవ్

నీటి కాలుష్యాన్ని అరికడతాం

బన్సీలాల్‌పేట్ కార్పొరేటర్ కే.హేమలత

కలుషిత జలాలు సరఫరా అవుతున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ హేమలత

బన్సీలాల్‌పేట్, జూన్ 15 : కలుషిత జలాల సరఫరా కారణాలను గుర్తించి, నివారణ చర్యలు చేపడతామని బన్సీలాల్‌పేట్ కార్పొరేటర్ కే.హేమలత అన్నారు. బండమైసమ్మ నగర్‌లోని డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో రెండు రోజులుగా కలుషిత నీరు సరఫరా అవుతున్నదని స్థానికులు ఫిర్యాదు చేయడంతో శనివారం ఆమె అక్కడికి చేరుకున్నారు. ఫోన్‌లో జలమండలి మేనేజర్‌తో మాట్లాడారు. వెంటనే అక్కడికి వచ్చిన సిబ్బంది నివారణ చర్యలు చేపట్టారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని ఆమె జలమండలి సిబ్బందికి సూచించారు.

నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 15: పెట్రోల్ బంక్‌లో పెట్రోలు పోసుకుని, డబ్బులు అడిగినందుకు బంకు సిబ్బందిపై దాడికి పాల్పడిన దుండగుడిని ఉస్మానియా యూనివర్సిటీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఓయూ పోలీస్ స్టేషన్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తార్నాకలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్‌లో ఈ నెల 8న సాయంత్రం నాలుగున్నర గంటలకు నంబర్ ప్లేట్ లేని యాక్టివాపై ఇద్దరు దుండగులు వచ్చి, రూ.100 పెట్రోల్ నింపుకున్నారు. డబ్బులు ఇవ్వకుండానే బైక్ స్టార్ట్ చేయడంతో బంకుకు చెందిన మరో ఉద్యోగి వాహనాన్ని వెనకనుంచి పట్టుకున్నాడు. ఈ క్రమంలో ఆ వ్యక్తులు బీరు సీసా తీసి, ఉద్యోగిపై దాడికి చేసి, అక్కడి నుంచి పరారయ్యారు. ఆ ఉద్యోగి కింద పడడంతో పాటు చేతులపై గాయాలయ్యాయి. దీనిపై బంకు ఉద్యోగులు ఓయూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం ఈ నెల 14న తార్నాకలో దాడికి పాల్పడిన నిందితుడు పాకాల లోకేశ్ (22)ను అదుపులోకి తీసుకుని అతడి నుంచి యాక్టివాతో పాటు సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. మరొక నిందితుడు ఆంజనేయులు పరారీలో ఉన్నారు. ఈ సమావేశంలో సీఐ రాజేందర్, ఎస్సై సీహెచ్ రవి పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న సీఐ

హిందుస్థాన్ స్కాట్స్ అండ్ గైడ్స్ సంస్థ ఆవిర్భావం

హిందూస్థాన్ స్కాట్స్ అండ్ గైడ్స్ సంస్థ ఆవిర్భావ కార్యక్రమంలో అతిథులతో క్యాడెట్లు

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 15: తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన హిందుస్థాన్ స్కాట్స్ అండ్ గైడ్స్ సంస్థ ఆవిర్భావ కార్యక్రమాన్ని ఆంధ్ర మహిళా సభ కళాశాల ప్రాంగణంలోని ఆడిటోరియంలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హిందుస్థాన్ స్కాట్స్ అండ్ గైడ్స్ జాతీయ అధ్యక్షుడు నర్సింగ్ మెహంజీ, స్టేట్ చీఫ్ కమిషనర్ డాక్టర్ అద్దంకి దయాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంస్థ ప్రాముఖ్యతను వివరించారు. మనిషి ప్రధానంగా ఒక సామాజిక సమాజంలో సభ్యుడన్నారు. అతను తన గురించి మాత్రమే కాకుండా, సమాజం సంక్షేమం, అభివృద్ధి కోసం కూడా శ్రద్ధ వహించాలని సూచించారు. మహిళలు మానసిక కుంగుబాటు నుంచి బయటకు వచ్చేందుకు స్కాట్స్ అండ్ గైడ్స్ ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు.

పైపులైన్ పనులు ప్రారంభం

పైపులైన్ పనులను ప్రారంభిస్తున్న బోర్డు సిబ్బంది

బొల్లారం,జూన్ 15:కంటోన్మెంట్ ఒకటో వార్డు పరిధిలోని బోయిన్‌పల్లి పంప్ హౌస్ నుంచి బైట్ కేఫ్ వరకు హెచ్‌డీపీఈ పైపులైన్ పనులను శనివారం ప్రారంభించారు.ఈ మార్గం గుండా పైపులైన్ వేయడం ద్వారా కడక్‌పురా బస్తీలో కాలుష్య నీటిని అరికట్టేందుకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ సందర్భంగా బస్తీ వాసులు బోర్డు సీఈఓ మధుకర్ నాయక్,బోర్డు అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు హసీన్ ఖాన్, విజయ్, ముక్తర్, సమీర్,రియాజ్,అస్లాం పాల్గొన్నారు.

గుంతల రోడ్లకు మరమ్మతులు

రోడ్డు ప్రమాదాల నివారణకు మారేడ్‌పల్లి ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. మారేడ్‌పల్లి షెనాయ్ ఆసుపత్రి నుంచి గీతా నర్సింగ్ హోం రోడ్డు వరకు ఇటీవల కురిసిన వర్షానికి రోడ్డు గుంతలమయంగా మారింది. దీంతో మారేడ్‌పల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జుట్టు భాస్కర్, సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ ఆధ్వర్యంలో సొంత డబ్బులతో ఇసుక, సిమెంట్ కంకరతో మరమ్మతు పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ భాస్కర్ మాట్లాడుతూ....మారేడ్‌పల్లి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రయాణికులు సురక్షితంగా ప్రయాణం చేయడమే తమ లక్ష్యంగా మా వంతు సేవ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. – మారేడ్‌పల్లి, జూన్ 15:

మూలనపడ్డ ప్రసాదం తరలించే లిఫ్ట్..

నెల రోజులుగా బల్కంపేట ఎల్లమ్మ దేవాలయంలోని మొదటి అంతస్తులో ఉన్న ప్రసాదం తయారీ గదుల్లో ఉన్న లిఫ్ట్ పని చేయడం లేదు. ఈ లిఫ్ట్ ద్వారా ఇక్కడ తయారైన ప్రసాదాన్ని కింది గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న ప్రసాద విక్రయ కేంద్రాలకు తరలించేందుకు ఈ లిఫ్ట్‌ను వినియోగిస్తారు. నెల రోజులకు పైగా ఈ లిఫ్ట్ పని చేయడం లేదు. ఇందుకు అవసరమైన మరమ్మతులు చేపట్టేందుకు దేవాలయ ఈవో సెలవుపై వెళ్లడంతో తాత్కాలిక ఈవోలుగా వచ్చిన వారు ఇప్పుడు విధుల్లో ఉన్నారు. దేవాలయానికి ఏ రోజుకారోజు భక్తుల తాకిడి పెరుగుతుండడంతో ప్రసాదాల తయారీ విభాగం నిరంతరం పని చేయాల్సిన పరిస్థితి.దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు ఇకనైనా ఈ లిఫ్ట్‌కు అవసరమైన మరమ్మతులు చేపట్టి తిరిగి వినియోగంలోకి తీసుకురావాలని భక్తులు కోరుతున్నారు. – అమీర్‌పేట్

కమ్మవారి సేవా సంఘాల ఆధ్వర్యంలో..

కమ్మవారి సేవా సంఘాల సమాఖ్య రాష్ట్ర కమిటీ సమావేశంలో ప్రతినిధులు

అమీర్‌పేట్: కమ్మవారి సేవా సంఘాల సమాఖ్య తెలంగాణ రాష్ట్ర కమిటీ సమావేశం శనివారం అమీర్‌పేట్‌లోని కమ్మ సంఘం సమాఖ్య కార్యాలయంలో జరిగింది. సమాఖ్య గౌరవాధ్యక్షులు సి.వి.రావు, రాష్ట్ర అధ్యక్షులు అరికెపూడి గాంధీల అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలు తీర్మానాలు జరిగాయి. ముందుగా ఈనాడు గ్రూపు సంస్థల చైర్మన్ చెరుకూరి రామోజీరావు మృతికి సమాఖ్య ప్రతినిధులు నివాళులర్పించారు. అనంతరం ఏపీ సీఎంగా నారా చంద్రబాబునాయుడు తిరిగి ఎన్నికవడాన్ని స్వాగతిస్తూ రాష్ట్ర కమిటీ తరపున అభినందనలు తెలియజేశారు. కమ్మ సామాజిక వర్గానికి చెందిన పిల్లలకు అవసరమైన విద్యారుణాలు మంజూరు చేయడానికి కృషి చేస్తామన్నారు.

CAUTOIN / PUBLIC NOTICE

The General Public are hereby informed that my client **Sri.Shiva Kumar Nayak Rathod S/o. R.Raja Naikis** the absolute owner and possessor of the all that House bearing No. 10-5-815/A, on Plot No. 86 & 69,admeasuring 132 Sq.Yds, situated at Indira Lakshmi Nagar,Tukaramgate, North Lallaguda, Secunderabad 500017 by virtue of a NOTARISED WILL dated 28-07-2017 executed by my client's mother Smt.R.Kalavathi in his favour. Recently my client came to know that his father R.Raja Naik without having any valid right, title, claim or interest over the said Property has executed a Regd Gift Deed in favour of Smt.Vanitha Singh W/o.Prahalad Singh (My client's sister) by mentioning the wrong House Number as 10-5-816/5, admeasuring 75 Sq.Yds situated at Tukaramgate, Secunderabad and with the said Regd Gift Deed my client's father and sister are trying to alienate the House which is part and parcel of my client's above mentioned property and the same is illegal and not binding on my client's above mentioned property.

Hence the General Public are hereby cautioned and warned not to enter into any Agreement of Sale or any other deed/s or document/s for purchase etc with the above said person/s or anyone else claiming through them, in respect of above said Property. Inspite, of this Caution Notice, if anybody enters into any Agreement, Deed or Document/s or deals with the above said person/sin any transaction in respect of the above said Property, he/she/they will be doing so at his/her/their own risk and also will be held responsible for consequences arising therefrom and also liable to be prosecuted according to law.

Sd/- **Smt. M.UMA DEVI,** Advocate,
O/a D.No:- 04-11-003, Plot No.77,
Syndicate Bank Colony, West Marredpally,
Secunderabad -500026. Mobile No:9573688764